ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

గురువారం 1 ఫిబ్రవరి 2024

కోదండరాంపై వేసిన పిటిషన్ వాపస్ తీసుకోవాలి 8లో..

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి 8లో..



రామగుండం బీ పవర్‌హౌస్

రామగుండానికి కొత్త వెలుగులు

- బీ పవర్‌హౌస్ స్థానంలో 800మెగావాట్ల కొత్త ప్రాజెక్టు
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సిఫార్సుతో సీఎంవో నుంచి ఆదేశాలు
- భూసేకరణకు రెవెన్యూ విభాగానికి ప్రభుత్వ సూచన

గోదావరిఖని, జనవరి 31: రామగుండం ప్రాంతం కొత్త వెలుగులు సంతరించుకోబోతున్నది.. ఏపీ జెన్‌కో ద్వారా 60ఏళ్ల క్రితం రామగుండంలో విద్యుత్ ప్లాంట్లు ప్రారంభమై తొలి వెలుగులు విరజిమ్మింది. గోదావరినది నీరు, సింగరేణి బొగ్గు, అత్యధికంగా ప్రభుత్వ భూములు కలిగి ఉన్న ఈ ప్రాంతం విద్యుత్ ఉత్పాదనకు అనువైన ప్రాంతంగా అప్పటి ప్రభుత్వాలు భావించాయి. రామగుండంలో దక్షిణ మధ్య రైల్వే మార్గం ఉండడం కూడా రవాణా సౌకర్యానికి మరో సౌలభ్యంగా ఉంది. ఈ నేపథ్యంలో రామగుండం అప్పటి ఉమ్మడి రాష్ట్రానికి మొట్టమొదటి వెలుగుల కేంద్రంగా విరాజిల్లింది. ఆ తరువాత జాతీయ విద్యుత్ కేంద్రం ఎన్‌టీపీసీ ఏర్పాటు, క్రమంగా 2400మెగావాట్లకు ఎగబాకింది. పాత సాంకేతికతతో ప్రారంభమైన రామగుండం ఏ పవర్‌హౌస్ 20ఏళ్ల క్రితమే మూతపడింది. బీ పవర్ హౌస్ కూడా మూసివేసే పరిస్థితికి వచ్చింది. బీ పవర్‌హౌస్ యంత్రాలు పాతవి కావడంతో 20ఏళ్ల క్రితమే మూసివేయాల్సి ఉన్నా ఇంకా నడిపిస్తూ వస్తున్నారు. ఈ మధ్య బీ పవర్‌హౌస్‌ను పరిశీలించిన జెన్‌కో బృందం బీ పవర్‌హౌస్‌ను మరికొంత కాలం కొనసాగించలేమని తేల్చిచెప్పింది. 1999లో రెండు 800మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను రామగుండంలో ఏర్పాటు చేసేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం బీపీఎల్ సంస్థ అనుమతి ఇచ్చింది. విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం బీపీఎల్ సంస్థ మల్యాలపల్లి, రావగుండం, పెద్దంపేట, పాములపేట, బ్రాహ్మణ పల్లి, అంతర్గాం గ్రామాల రెవెన్యూ శివారుల్లో మొత్తం 1860ఎకరాల భూమిని సేకరించింది. కానీ అప్పటి ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు విషయంలో వచ్చిన వివాదంతో బీపీఎల్ సంస్థ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని నిలిపివేసింది. 25ఏళ్లుగా రామగుండంలో విద్యుత్ ప్లాంట్ కల కలగానే మిగిలింది. రామగుండంలో ఏ పవర్‌హౌస్ స్థానంలో విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని 20ఏళ్ల నుంచి రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అనేక రకాల పోరాటాలు నిర్వహించారు. నిరాహార దీక్షలు కూడా చేశారు. కానీ ఇప్పటికీ రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పడలేదు.

• ఎన్నికలకు ముందు హామీ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను గెలిస్తే విద్యుత్ ప్లాంట్ తీసుకువస్తానని, అది తన చిరకాల వాంఛ అని ప్రకటించారు. గెలిచిన తరువాత రామగుండం ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుల సమక్షంలో ఈ అంశంపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి రామగుండంలో విద్యుత్ ప్లాంట్‌పై సాధ్యా సాధ్యాలు పరిశీలించమని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు సీఎంవో నుంచి రెవెన్యూ విభాగానికి ఆదేశాలు అందాయి. ఏ పవర్‌హౌస్, బీ పవర్ హౌస్ స్థానాల్లో జెన్‌కోకు ఎంత భూమి ఉన్నది, ప్రభుత్వ భూమి ఎంత, 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు అవసరమున్నంత భూమి అందుబాటులో ఉందా అనే వివరాలను సేకరించాలని సీఎంవో చెప్పినట్టు తెలిసింది. ఈ మేరకు స్థానిక రెవెన్యూ అధికారులు భూమి లభ్యతపై రికార్డులు చూస్తున్నారు. 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 500ఎకరాలకు పైగా భూమి అవసరంతో పాటు యాష్ పాండ్ నిర్మాణానికి 300ఎకరాల భూ అవసరాలు ఉన్నాయి. అయితే 1999లో ఏపీ ట్రాన్స్‌కో నుంచి మల్యాలపల్లిలో 169ఎకరాల ప్రైవేట్ భూమి, 87ఎకరాల ప్రభుత్వ భూమి రామగుండంలో 14ఎకరాల ప్రైవేట్ భూమి, 174ఎకరాల ప్రభుత్వ భూమి ట్రాన్స్‌కోకు కేటాయించబడి ఉంది. ఈ భూమిని 800మెగావాట్ల ప్లాంట్ పెట్టేందుకు బీపీఎల్‌కు అప్పగిస్తూ అప్పటి ప్రభుత్వం ట్రాన్స్‌కో ద్వారా ఒప్పందం చేసింది. ప్రాజెక్టు ఏర్పాటు చేయలేదు కనుక ఆ భూమిని ప్రభుత్వానికి ఇవ్వమని బీపీఎల్‌ను కోరగా గతంలోనే కోర్టును ఆశ్రయించింది. తమకు కేటాయించిన భూమిని తిరిగి ఎలా ఇస్తామని బీపీఎల్ వాదిస్తున్నది. బీపీఎల్‌కు కనీసం నోటీసు ఇవ్వకుండా భూమిని తిరిగి ప్రభుత్వం ఎలా తీసుకుంటుందని కోర్టు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వం ఇప్పుడు బీపీఎల్‌కు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమైనట్టు రెవెన్యూ అధికార వర్గాలు చెబుతున్నాయి.

• రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు..

రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టు ఈ పరిణామాలను బట్టి స్పష్టమవుతున్నది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఒత్తిడితో రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. ఇదే విషయమై రామగుండం రెవెన్యూ అధికారులను సంప్రదించగా, ప్రస్తుతం జెన్‌కో దగ్గర ఉన్న భూమి, బీపీఎల్‌కు ఇచ్చిన భూమి, దాని పూర్వాపరాలకు సంబంధించిన విషయాలను సేకరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్టు చెప్పారు. ఈ అంశంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కూడా రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు అయ్యే వరకు విశ్రమించేది లేదని, ఎన్ని అడ్డంకులు వచ్చినా 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను రామగుండానికి తీసుకువస్తానని చెప్పారు. ఎన్‌టీపీసీ 800/2 సెకండ్ ఫేస్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును కూడా వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ పరిణామం రామగుండానికి పూర్వవైభవం తీసుకువచ్చే అవకాశాలను మెరుగుపరుస్తున్నది. రామగుండంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం జరిగితే రామగుండం అర్బన్, అంతర్గాం మండలం ప్రాంతాల్లో మరోమారు పారిశ్రామిక శోభ సంతరించుకోనున్నది. మరోవైపు శ్రీపాద ఎల్లంపల్లి ఎత్తిపోతల విద్యుత్ అవసరాలకు ఈ ప్లాంట్ ఉపయోగపడే అవకాశం ఉన్నది.

గురుకులాలకు సరఫరా చేసే పాల ధర తగ్గింపు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గురుకులాలకు సరఫరా చేసే పాల ధరలను అధికారులు తగ్గించారు. 'పాల సరఫరాలో మాయాజాలం' అనే శీర్షిక ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ స్పందించారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలకు సరఫరా చేస్తున్న విజయ డెయిరీ పాలను లీటర్‌కు ఎమ్మార్పీకి మించి రెండు రూపాయలు అదనంగా చెల్లిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టెండర్‌లు ఖరారు చేసే సమయంలో సంబంధిత అధికారులు పాల ధరలను పట్టించుకోకుండానే టెండర్ ఖరారు చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో పాల సరఫరాలో మాయాజాలం శీర్షిక కథనం ప్రచురితమయ్యింది. దీనికి స్పందించిన అధికారులు జిల్లాలోని ఆరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే విజయ డెయిరీ లీటర్ పాలకు ఎమ్మార్పీ మాత్రమే చెల్లించాలని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఉత్తర్వులను వెంటనే అమలులోకి తీసుకరావాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 31: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఆర్‌డీవో హనుమా నాయక్ బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే వార సమీక్ష భాగంగా ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, పార్లమెంట్ ఎన్నికల సన్నాహక చర్చ తోపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేత శశిభూషన్ కాచే, వివిధ పార్టీల నేతలతో పాటు నియోజకవర్గంలోని పది మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

8న మల్లన్న ఆలయంలో వేలంపాట

ఓదెల, జనవరి 31 : ప్రసిద్ధ భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 8న ఉదయం 10 గంటల నుంచి తొమ్మిది రకాలకు 2024-25కు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ, అగర్‌వత్తులు అమ్ముకొనే హక్కు, కిరాణం, పూజాసామగ్రి, ప్యాలాలు, పుట్నాలు, వంటచెరుకు, వాహనాల పార్కింగ్, కూల్‌డ్రింక్స్, పూలదండలు, కొబ్బరిముక్కల పోగు, తల్లి ఆరాధనతో పాటు తదితర వాటిని జాతరలో అమ్ముకొనే హక్కు కోసం వేలం ఉంటుందని పేర్కొన్నారు. 2024 మార్చి 3నుంచి 2025 మార్చి 2వరకు విక్రయించుకునే హక్కు ఉంటుందని తెలిపారు. ముందుగా ధరావత్ సొమ్ముతోపాటు, టెండర్ దరఖాస్తులకు డబ్బులు చెల్లించి కార్యాలయంలో రసీదు తీసుకోవాలని ఈవో తెలిపారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధించాలి : డీఈవో



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఈవో మాధవి

జ్యోతినగర్, జనవరి 31 : పాఠ్యాంశాల పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచేలా విద్యా బోధన జరగాలని డీఈవో డి.మాధవి అన్నారు. గత ఐదు రోజులుగా ఎన్టీపీసీ టీటీఎస్ జిల్లా పరిషత్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రయోగాల శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాధవి మాట్లాడుతూ జీవశాస్త్ర ప్రయోగాల ప్రయోగాల ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధన చేయడంలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యం పెరుగుతుందని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ప్రధానంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు ప్రయోగ దీపికల, సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లా విద్యా శాఖ, తెలంగాణ జీవశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏఎంవో పి.ఎం.షేక్, హెచ్‌ఎం. జయరాజు, సైన్స్ అకాడమి అధికారులు డాక్టర్ ఎస్.రేవతి, అమీర్ అలీ, తెలంగాణ జీవశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజనీకుమార్, నరేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 31 : మండలంలోని నిట్టూరు జిల్లా పరిస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డబ్ల్యూడిడబ్ల్యూఎస్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 500 లీటర్ల నీటిశుద్ధి ప్లాంట్ ఏర్పాటులో పాటు 23 మంది బాలికలకు సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి మాధవి హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపసర్పంచ్ గిరినేని సంపత్‌రావు, ఎస్ఎంసీ అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదం : సీఐ

సుల్తానాబాద్, జనవరి 31 : నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు దోహద పడుతాయని సుల్తానాబాద్ సీఐ కర్ర జగదీష్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో కౌన్సిలర్ పారుపల్లి జ్ఞానేశ్వరి గుణపతి ఆధ్వర్యంలో కాలనీలో లక్ష 30 రూపాయల సొంత ఖర్చులతో 10 సీసీ కెమెరా లు ఏర్పాటు చేయగా, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ జగ దీష్ హజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజేందర్, మాజీ జడ్పీ టీసీ డాక్టర్ ఐల రమేష్, నాయకులు ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాష్ రావు, కుమార్ కిషోర్, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్పన్నపేట సింగిల్‌విండో చైర్మన్‌గా సంపత్



సంపత్‌కుమార్‌కు ప్రొసీడింగ్‌ను అందిస్తున్న శ్రీమాల

పెద్దపల్లి రూరల్, జనవరి 31 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా చింతపండు సంపత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా సంపత్ ఎన్నికైనట్లు జిల్లా సహకార అధికారి శ్రీమాల ప్రకటించారు. మూడు రోజుల పాటు సొసైటీ ఎన్నికలు మలుపులు తిరుగుతూ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం చైర్మన్ అభ్యర్థి సంపత్‌కుమార్ తో పాటు 9 మంది సభ్యులు అధికారుల ముందుకు హాజరుకాగా సంపత్‌కుమార్‌ను చైర్మన్‌గా ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్ మద్దతు మేరకు బీఎస్పీలో కొనసాగిన సంపత్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సమక్షంలో డైరెక్టర్లతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చైర్మన్ ఎన్నిక దృష్ట్యా సొసైటీ కార్యాలయం వద్ద పెద్దపల్లి సీఐ కృష్ణ ఆధ్వర్యంలో బసంత్‌నగర్ ఎస్సై వెంకటేష్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలో సింగిల్ విండో డైరెక్టర్లు, సీఈవో తిరుపతి పాల్గొన్నారు.

ముత్తారం సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసానికి సన్నాహాలు

ముత్తారం జనవరి 31: ముత్తారం సింగిల్‌విండో చైర్మన్ పదవికి అవిశ్వాస గండం తప్పేలా లేదని తెలుస్తోంది. చైర్మన్‌గా కొనసాగుతున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన గుజ్జుల రాజిరెడ్డి సింగిల్ విండో ఎన్నికలు సమయంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ప్రస్తుతం అవిశ్వాసంతో రాజిరెడ్డిని గద్దె దింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికోసం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం డైరెక్టర్లు ఏలువాక కొమురయ్య, గుజ్జ గోపాలరావు, నాయిని పార్వతిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే మంగళవారం సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డితో పాటు గిరి వీరేందర్, కొంకటి మల్లయ్య, అల్లం నిర్మలలు చైర్మన్ రాజిరెడ్డికే మద్దతు తెలుపుతామని జడ్పీ చైర్మన్ పుట్ట మధు ఆధ్వర్యంలో ప్రతిపాదించారు. ఇరువైపులా సమాన కోరం ఉండగా, త్వరలో సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు సమాచారం.

తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్..

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31: తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గది, చదువుకునే గది, మరుగుదొడ్లు, చుట్టూ పరిసరాలను, విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో 300మంది బాలికలు చదువుకుంటున్నారని, వారికి గదులు సరిపోవడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అదనపు కలెక్టర్‌కు వివరించారు. కస్తూర్బా పాఠశాల పక్కనే డబుల్ బెడ్‌రూమ్‌లు ఖాళీగా ఉన్నాయని, అందులో కొన్ని క్లాసులు నిర్వహించాలనుకుంటున్నామని తెలియజేయగా, బాలికలకు అందులో క్లాసులు నిర్వహిస్తే రక్షణ లేకుండా ఉంటుందని, అందులో నిర్వహించవద్దని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ పదో తరగతి, ఇంటర్ చదివే విద్యార్థినులతో మాట్లాడుతూ విద్య అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని వివరించారు. చదువును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో కష్టాలే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంఈఓ రాజన్న, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సునీత, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలించిన అధికారులు

జూలపల్లి, జనవరి 31 : మండలంలోని కుమ్మరికుంట గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను బుధవారం తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేక అధికారి రంగారెడ్డి, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో సదానందం, పంచాయతీ కార్యదర్శి అంజలీదర్‌రావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు అమలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



బ్రాహ్మణపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జనవరి 31 : అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఈజీఈఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రైతులు పండించిన ధాన్యం విక్రయించాలంటే గత ప్రభుత్వం కటింగ్ పేరుతో మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపడుతామన్నారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రామ్మూర్తి, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, సర్పంచ్ గాండ్ల మల్లేశం, ఎంపీటీసీ నిర్మల-శ్రీని వాస్, ఏడెల్లి శంకర్, ఉప్పు రాజు, రాజేందర్, పరమేష్, గుమ్మడి విజయ్, ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 31 : మండలంలోని నారాయణరావుపల్లిలో డీఎంఎఫ్‌టీ నిధులు 15.28 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మహిళా భవనాన్ని బుధవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావును సర్పంచ్ దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోలుగురి వెంకటలక్ష్మి, అంజయ్య, ఎంపీపీ బాలాజీరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎలిగేడు, జనవరి 31 : గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళంవారం ఎలిగేడు మండల కేంద్రంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25లక్షల నిధులతో అంబేద్కర్ చౌక్ నుంచి సుల్తాన్‌పూర్ రోడ్డు వరకు నిర్మాణం చేపట్టనున్న సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచ్ బూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, విండో డైరెక్టర్ తాటిపల్లి రమేష్‌బాబు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమ్ముల రమేష్, సింగిరెడ్డి చంద్రారెడ్డి, కోట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

- జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జాతర ప్రాంగణంలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 31: గోదావరిఖని గోదావరి వంతెన వద్ద ఫిబ్రవరి 21 నుంచి 24వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లను త్వరతగిన పూర్తి చేయాలంటూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధికారులకు ఆదేశించారు. బుధవారం జాతర ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, గతంలో చెత్తను వేసిన ప్రాంతంలో మట్టితో కప్పి దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతర సమయం దగ్గర పడుతున్నందున పనులను వేగవంతం చేయాలని, భక్తులకు తాగునీరు, గోదావరి వద్ద బట్టలు మార్చుకునేందుకు షెడ్ల ఏర్పాట్లు చేయాలని సూచించారు. సింగరేణి, ఎన్‌టీపీసీ సమన్వయంతో వ్యవహరిస్తూ పనులను నిర్వహించాలన్నారు.

భూమిని చదును చేసిన ఎమ్మెల్యే..

సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో పిచ్చి మొక్కలను, తుమ్మ పొదలను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ జేసీబీని నడుపుతూ తొలగించారు. బ్లేడ్ ట్రాక్టర్‌తో భూమిని చదును చేశారు. భక్తులకు అన్నీ ఏర్పాట్లు చేయాలని, ఇబ్బందులకు గురి కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, మారెల్లి రాజిరెడ్డి, ఉల్లంగుల రమేష్, జనగామ శ్రీనివాస్, కారం వినయ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేయాలి

- పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా - నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కోల్‌సిటీ, జనవరి 31: ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న జెట్టి వర్షిత్ అనే విద్యార్థిపై ప్రిన్సిపాల్ విచక్షణరహితంగా చితకబాదాడని, అతనిపై కేసు నమోదు చేయాలంటూ బుధవారం విద్యార్థి సంఘాలు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించాయి. పాఠశాలలోకి చొచ్చుకువెళ్లిన ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఆర్ఎస్వీ నాయకులు పాఠశాల గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జెట్టివ వర్షిత్ మరో విద్యార్థితో మాట్లాడుతున్న సందర్భంలో ఉపాధ్యాయురాలు తనను అసభ్యంగా మాట్లాడాడని అపార్థం చేసుకుని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిందని, ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా విద్యార్థిని అమానుషంగా చితకబాదాడన్నారు. ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసుకుని చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల ప్రీతం, సహాయకార్యదర్శి మొలుగూరి నితిలేష్, కార్పొరేషన్ అధ్యక్షుడు సాగర్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు భైరిమల్ల దుర్గా ప్రసాద్, బీఆర్ఎస్వీ నాయకులు ఇరుగురాళ్ల శ్రావణ్, అబ్బాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శంకర్, అక్షయ్, బట్టు, సృజన్ పాల్గొన్నారు. కాగా ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేములవాడ టౌన్, జనవరి 31: మద్యం మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేర్గు శ్రీనివాస్ (26) అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుడి భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.


జి సాయిప్రియ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థిని

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే 49వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారిణి జి సాయిప్రియ ఎంపికైంది. గత నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి కరీంనగర్ జట్టుకు 3వ స్థానాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ టి. శ్రీలక్ష్మి, అధ్యాపక బృందం అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని మొగిళిపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అపూర్వ ఫిబ్రవరి 2 నుంచి 6వరకు ఛత్తీషఢ్ రాష్ట్రం, ఖాబీర్ దాంలో జరగనున్న జాతీయ స్థాయి పాఠశాలల క్రీడల ఆధ్వర్యంలో జరగనున్న సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జనవరి 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 67వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ 14 సంవత్సరాల విభాగం పోటీల్లో కరీంనగర్ జిల్లాకు అపూర్వ, సాయి శరణ్యలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో మూడవ స్థానంలో గెలుపొందగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అపూర్వను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అపూర్వను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పిఈటి అడేపు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు ఈశ్వర్, వివేక్, విద్యా సాగర్, దేవేందర్, లక్ష్మి, తిరుమల, గ్రామ సర్పంచ్ సుస్మితరెడ్డి, ఎంపిటిసి తిలక్ ప్రియారెడ్డి అభినందించారు.

సైబర్ మోసంతో డబ్బులు మాయం

వీణవంక జనవరి31: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి వెంకటేష్ మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. బీట్‌కాయిన్‌తో ఎంత డబ్బులు పెడితే అంతకు రెట్టింపు డబ్బులు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 6,42,040 రూపాయలు కాజేశారని అనంతరం ఎలాంటి స్పందన లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్‌కు వచ్చే అనవసరపు లింకులు ఓపెన్ చేయవద్దని సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా మోసపోవద్దని తెలిపారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం సమీక్ష

● రూ.20 కోట్ల నిధుల విడుదలకు ఆదేశం ● రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో రూ.35 కోట్ల నిధులు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గతంలో హెచ్ఎండీఏ సాఫ్ట్ లోన్ ద్వారా మంజూరై నిలిచిన రూ.20 కోట్ల నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న పనులపై పవర్ ప్రజంటేషన్ ద్వారా వీటీడీఏ వైస్ చైర్మన్ అనురాగ్ జయంతి ముఖ్యమంత్రికి వివరించారు. దేవస్థానం అభివృద్ధి, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి నమూనాలను, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ చేపడుతున్న పనులను వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నిలిచిపోయిన నిధులు రూ 20 కోట్లను విడుదల చేయాలని ఆదేశిస్తూ బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహం ఏర్పాటుతోపాటు పార్కు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధితోపాటు టూరిజం శాఖ పనుల్లో వేగం పెరగాలన్నారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా మూలవాగు బ్రిడ్జితో పాటు బ్రిడ్జి నుంచి 800 మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల విస్తరణతోపాటు మూలవాగు బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.35 కోట్ల నిధులు త్వరలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిచెరువులోకి వివిధ కాలువల ద్వారా మురికి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతన కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మురుగు కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల విడుదల చేయాలని, మురుగు నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయాలని అన్నారు. గుడిచెరువు విస్తీర్ణం, పార్కింగ్ స్థలాల వివరాలను సీఎం తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్, వేములవాడ కమిషనర్ అవినాష్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం

హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. మురికి నీటి కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసి వీటీడీఏ సమావేశాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డైట్‌లో పద్య రచన కార్యశాల

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం పద్య రచన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రముఖ కవి, అవధాని, సాహితీ రత్న డాక్టర్ గండ్ర లక్ష్మణరావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పద్యం సాంస్కృతిక వారసత్వాన్ని, జాతి జీవనాన్ని భావితరాలకు అందిస్తుందన్నారు. పద్యం బ్రహ్మ పదార్థం కాదని, పద్యం రాయడం చాలా తేలిక అని తెలిపారు. పద్యం లయను, నాడిని, నడకను పట్టుకుంటే పద్య రచన చాలా తేలిక అని అన్నారు. పద్యంలో చందోనియమాలు ఉన్నప్పటికీ ఆ చందస్సు నియమమే పద్య రచనలను చాలా హృద్యంగంగా, రసనైకవేద్యంగా మలు స్తుందన్నారు. పద్య లక్షణాలను గణాలను, యతిప్రాసలను వివరిస్తూ ఏఏ సందర్భాల్లో ప్రాస నియమం పాటించబడుతుందో సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య మాట్లాడుతూ జిల్లా విద్యా శిక్షణ సంస్థ కేవలం పెడగాగికి సంబంధించిన అంశాలే కాకుండా ఛాత్రోపాధ్యాయుల పరిపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడే విధంగా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగానే పద్య రచనపై కార్యశాల నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యశాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో విద్యార్థులు మంచి పద్య కవులుగా ఎదగాలని ఆశిస్తున్నామన్నారు. విభిన్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు కె.శంకర్, చెరుకు ప్రద్యుమ్న కుమార్, మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ దాడులు

● ఐదు కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 31: నగరంలోని బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహిచి ఐదు కేసులు నమోదు చేశారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో వినియోగదారుల ఫిర్యాదు మేరకు శ్రీమాతారైస్‌డిపో, సాయిసరస్వతి కిరాణం, ఉప్పల క్రిష్ణమూర్తి కిరాణ షాపులపై దాడులు చేసి ఐదు కేసులు నమోదు చేసి, 230 రైస్ బ్యాగులు సీజ్‌చేశారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజి కరీంనగర్ జోన్ ఎసి కె విజయ సారధి, కరీంనగర్ జిల్లా ఇన్స్‌పెక్టర్ భూలక్ష్మి, ఇన్స్‌పెక్టర్ డి రూపేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో జింకు లోపాన్ని గుర్తించాలి

గంగాధర, జనవరి 31: వరిలో జింకు లోపం నివారణకు పొలాలు ఎర్రబడకుండా ఉండేందుకు జింకు వేయాలని జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కాసారం, పోతుగంటిపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసుకున్న రైతులు తప్పకుండా మెలుకువలు పాటించాలని, ఎప్పటికప్పుడు పంట ఏ రకంగా పెరుగుతుందో పరిశీలించాలన్నారు. ఇటుక రంగుతో పైరు ఎర్రబారిన వెంటనే జింక్ వేసుకోవాలని జింక్ వేయకుండా నిర్లక్ష్యం చేస్తే పంటలు పాడవుతాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో జింక్‌లోపం, కాండం తొలుచుపురుగు, సల్ఫైడ్ ప్రభావం కనిపిస్తుందన్నారు. నివారణకు తగిన మందులు వాడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో రాజు, ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

అంజన్న భూములపై డిజిటల్ సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, జనవరి 31: దిగువ కొండగట్టులో గల అంజనేయస్వామి దేవస్థానం భూములను అధికారులు బుధవారం డిజిటల్ సర్వే చేశారు. సర్వే నంబర్ 380సిలో దేవస్థానానికి 1.30ఎకరాల భూమి ఉండగా అందులో ఇటీవల అక్రమ నిర్మాణం జరుగుతుందని పలువురు ఫిర్యాదు చేయడంతో సర్వే చేపట్టారు. పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఏఈ లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు సర్వే సిబ్బందితో దేవస్థానం భూమిని, నిర్మాణాన్ని పరిశీలించారు.

ధర్మపురిలో బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పూజలు

ధర్మపురి, జనవరి 31: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బీసీ వెల్ఫేర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయం సంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. అలాగే వారు అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడా సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సాయిబాబా, బీసీ హాస్టల్ వార్డెన్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, హాస్టల్ వార్డెన్స్ సుధాకర్, నివేదిత, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న చంద్రశేఖర్ దంపతులు

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


వేములవాడలో నృత్య ప్రదర్శన

వేములవాడ, జనవరి 31 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో రెండో రోజు బుధవారం నిర్వహించిన పలు సంగీత నృత్య కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం శిఖామణి భాగవతారిణి హరికథా గానం చేయగా మధ్యాహ్నం జయకృష్ణ భాగవతార్ హరికథ వినిపించారు. సాయంత్రం కె. నరహరి శర్మ, హెచ్. సతీష్, ఆర్. హరికృష్ణ సంగీత కచేరితో సంగీతాభిమానులను అలరించారు. అనంతరం డీవి మోహన కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరి చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం ఎన్. సతీందర్, ఆర్. విజయశ్రీ, శ్రీదేవి, వి. శరణ్య, అశ్విని బృందం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. రాత్రి శ్రీత్రైలోక్య ఆర్ట్ క్రియేషన్స్ బృందం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది.

గట్టుసింగారంలో వెలుగులోకి రాతి చిత్రాలు


రాతి చిత్రాలతో ఉన్న గుహను చూపిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం

పంజాగుట్ట,జనవరి31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామంలోని సీతమ్మ లొద్దిలో పాము పడగలా ఉన్న అతి పెద్ద రాతి గుహ, అద్భుతమైన రాతి చిత్రాల సంపద వెలుగులోకి వచ్చింది. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల శిలాజం, లక్ష సంవత్సరాల క్రితం నాటి రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పనిముట్లు, తొలి చారిత్రక యుగానికి చెందిన ఆరు శాసనాలు, చిత్రాలు వెలుగు చూశాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు, ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి దీనిని వెలుగులోకి తెచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగిరి ఖిల్లా వెనకాల అడవిలో సీతమ్మలొద్దిలో గుహ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో బృం దంతో కలిసి వెళ్లినట్లు తెలిపారు. ఈ రాతి చిత్రాలలో మధ్యరాతి యుగం(12 వేల సంవత్సరాల నుంచి), తొలి చారిత్రక యుగం(క్రీస్తు శకం 1 నుంచి 6వ శతాబ్దం వరకు)వేసినవి, ఎక్కువగా ఎరుపు రంగులో, కొన్ని చోట్ల తెలుపు, పసుపు రంగులలో వేసిన పురాతన రాతి చిత్రాలు ఉన్నాయన్నారు. ఇలాంటి రాతి చిత్రాలు గతంలో ఎక్కడా లభించలేదని తెలిపారు. స్త్రీ, పురుషులు ప్రత్యేకమైన ఆహార్యంతో, పాదరక్షలు ధరించి ఒక పంక్తిలో, గుండ్రంగా చేతులు పట్టుకుని సామూహికంగా నృత్యాలు చేస్తున్న దృశ్యాలు ఉన్నాయని, జంతువుల చిత్రాలలో జింకలు, తాబేళ్లు, అడవి పిల్లి, కోతులు, అడవి బల్లుల బొమ్మలు, మనుషుల చిన్న, పెద్ద పాద ముద్రికలు ఉన్నాయన్నారు. బృందం ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్నామని, దానిని భావితరాలకు అందిస్తామన్నారు. తెలంగాణలో ఎంతో చరిత్ర ఉందన్నారు. పరిశోధనలతో చరిత్రను వెలుగులోకి తెస్తామన్నారు. రాతి చిత్ర నిపుణుడు, న్యూమిస్మాటిస్ట్ డాక్టర్ బండి మురళీధర్ రెడ్డి, సంస్థ కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కో కన్వీనర్ గిరీష్, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, ఆర్కియాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, జనవరి 31: సహజీవనం చేస్తున్న మహిళను కర్రతో కొట్టి ఆమె చావుకు కారకుడైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మికుమారి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బక్కర్ గ్రామానికి చెందిన మహిళ రామ్ కాళీ (26)కి పెళ్లయి ఇద్దరు సంతానం ఉన్నారు. అదే గ్రామానికి చెందిన టెక్కం శ్యామ్‌రాజ్ (29)తో ఆమె అక్రమ సంబంధం కారణంగా రామ్‌కాళీ భర్త ఆమెతో విడాకులు తీసుకున్నాడు. తన ఇద్దరు పిల్లల్ని తల్లి దగ్గర వదిలి రామ్ కాళీ బతుకుదెరువు కోసం శ్యామ్‌రాజ్‌తో కలిసి కరీంనగర్‌కు వచ్చి అల్గునూర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీపనికి వెళ్తున్నారు. 2022 నవంబర్ 1న మేస్త్రీ శ్యామ్‌రాజ్‌కు కూలి డబ్బులు ఇవ్వగా అవి నాకు ఇవ్వాలని వాటిని తల్లి పిల్లల పోషణకు పంపించాలని శ్యామ్‌రాజ్‌తో గొడవ పడింది. కొద్ది డబ్బులు తన దగ్గర ఉంచుకొని మిగతా డబ్బులను శ్యామ్ రాజ్ ఆమెకిచ్చినా వినకుండా మొత్తం డబ్బులు కావాలని ఆమె అడుగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనితో శ్యామ్‌రాజ్ అక్కడే ఉన్న కర్రతో రామ్ కాళిని తలపై కొట్టగా తీవ్ర గాయాలతో ఆమె చనిపోయింది. ఈ సంఘటనపై ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి శ్యాంరాజుపై హత్యానేరం నమోదు చేయగా సీఐ శశిధర్‌రెడ్డి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలురు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యామూర్తి శ్యామ్‌రాజ్‌కు జీవిత ఖైదుతోపాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, జనవరి31: పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇల్లెందుల గంగాధర్ (45) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన గంగాధర్ పట్టణంలోని అర్బన్ కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ కుల వృత్తి అవుసుల పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి గంగాధర్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ తరచుగా బాధపడేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్య


ఎర్ర నవీన్(ఫైల్)

తార్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన ఎర్ర నవీన్ (23) ఓయూలో ఎం.కామ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి బిట్ కాయిన్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపం చెందిన నవీన్ ఓయూలోని మంజీరా హాస్టల్‌లో మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు నవీన్‌ను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ పంచాయతీ విషయమై రైతు ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31: ఐదేళ్లుగా భూపంచాయతీని పెద్దమనుషులు సాగదీస్తుండడంతో జీవితం మీద విరక్తి చెందిన మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన రైతు బొజ్జం శివకృష్ణ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అంతకు ముందు ఆత్మహత్య చేసుకుంటున్నానని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు పంచాయతీని సాగదీస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శివకృష్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం తుమ్మన్నపల్లి గ్రామ శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతు న్న గురుదాస్‌సింగ్‌దార్(53) అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి31: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రెండు పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో రెండు పరీక్ష కేంద్రాలలో కలిపి 880మందికి 862 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 18మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 817 మందికి 760మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 57మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్‌టిఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మంథని, జనవరి 31: త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని ఎంఈవో దాసరి లక్ష్మి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పరీక్షలు అంటే భయపడకుండా విద్యార్థులు టీచర్లు చెప్పే సూచనలు, మెలకువలు, జాగ్రత్తలను పాటిస్తూ మంచిగా పరీక్షలు రాయటానికి సన్నద్ధం కావాలన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికావద్దన్నారు. ఎంఎస్ఓఎస్ హరిప్రసాద్, కాంప్లెక్స్ హెచ్ఎంలు గీట్ల భరత్‌రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, జే. నరేష్‌కుమార్, ట్రైనర్ హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ టీఎస్) నూతన క్యాలెండర్, డైరీ మంథని మండల విద్యాధికారి దాసరి లక్ష్మి బుధవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతరం పోరాడే సంఘం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అని రాష్ట్ర విద్యా సదస్సుల కమిటీ కో-కన్వీనర్ వొడ్నాల సహేందర్ వెల్లడించారు. ఈసందర్భంగా ఎంఈవో లక్ష్మి, మండల నోడల్ అధికారి హరిప్రసాద్‌లను సన్మానించారు. మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శేషాద్రి, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు దివాకర్, మండల అధ్యక్షుడు నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మండల ఆర్థిక కార్యదర్శి రాజేష్ కుమార్, ఉపాధ్యక్షుడు పరమేష్, నగేష్, సమ్మయ్య, రాము, శ్రీనివాస్, ప్రసన్న, శ్యామల, సుప్రియ, సారమ్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

మంథని, జనవరి 24: ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులు సంపూర్ణ ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య శిబిరంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించగా నలుగురు రక్తహీనతతో ఉన్నట్లు గుర్తించి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సురేష్ కుమార్, ఉపాధ్యాయులు జక్కీ రాజేందర్, చౌదారపు శ్రీనివాస్, బిరుదు మధుకర్, ఉమా మహేశ్వర్, శ్రీలక్ష్మి, శ్రీదేవి, పుష్పలత, ఫార్మసిస్ట్ శారద, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ సేవ సమస్యలను పరిష్కరించాలని వినతి

పెద్దపల్లి రూరల్, జనవరి 31: మీ సేవ నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని మీసేవ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మీసేవ నిర్వహించడం చాలా కష్టంగా ఉందని, సేవలకు కమీషన్‌లు పెంచాలని, రెన్యూవల్ ఫీజులు పూర్తిగా రద్దు చేయాలని, స్టేషనరీ పేపర్‌లు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు కమీషన్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత విద్యుత్, ఇంటర్‌నెట్ కల్పించాలని విన్నవించారు. ధరణికి సంబంధించిన సర్వీస్‌లు పూర్తిగా మీసేవ లాగిన్‌లో పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సత్యనారాయణ, మహేందర్, భూమయ్య, రామకృష్ణ, మల్లేశం, రాజేందర్, తిరుపతి, సురేష్, మల్లేశం, ఖదీర్, నరేందర్, సాగర్, నవీన్‌లతో పాటు పలువురు ఉన్నారు.

కాంగ్రెస్ 7వ డివిజన్ అధ్యక్షునిగా నజీమోద్దీన్

కళ్యాణ్‌నగర్, జనవరి 31: కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ 7వ డివిజన్ అధ్యక్షునిగా ఎండీ నజీమోద్దీన్‌ను నియమిస్తూ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నజీమోద్దీన్ మట్లాడుతూ 7వ డివిజన్ అధ్యక్షుడిగా తనను నియమించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫాకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు

రామగిరి, జనవరి 31: మండలంలోని నాగేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని బుధవారం సర్పంచ్ కొండవేన ఓదెలు ప్రారంభించారు. కార్యక్రమానికి ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణగౌడ్, ఉపసర్పంచ్ అనిల్, నాయకులు వేగొలపు శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ సెక్రటరీ గొర్రె సంతోష్, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 31 : కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీపీఎంవో ప్రకాష్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకాష్‌రావు మాట్లాడుతూ కుష్టువ్యాధికి ఎండీటీ మందుల ద్వారా పూర్తిగా నయమవుతుందని, మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో దొరుకుతాయన్నారు. ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఏఎన్ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పద్మ, రజితలు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పోస్టింగ్ రద్దు చేయాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 31: పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎస్‌సీఆర్‌టీలో డిప్యూటేషన్ రద్దుతో వెనక్కి వచ్చి మంథని మండలం కన్నాల ప్రభుత్వ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పనిచేస్తున్న సువర్ణవినాయక్ డిప్యూటేషన్ రద్దు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామంకిషన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మంథని మండలంలోని ఆరెంద లేదా నాగపల్లి గ్రామాల్లోని పాఠశాలలో పోస్టింగ్ ఇవ్వాలని సూచించారు.

అయోధ్య సైకిల్ యాత్రికులకు సన్మానం

రాయికల్, జనవరి 31: పట్టణంలోని గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ అయోధ్య బాలరాముని దర్శనానికి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్‌కు చేరుకు న్న యువకులను మండలంలోని అయోధ్య గ్రామంలోని రామ మందిరంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆణిముత్య కల్చరల్ డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ కొమురవెల్లి చిరంజీవి, సర్పంచ్ ఎడమల జీవన్ రెడ్డి, ఎంపీటీసీ రాణవేణి రవీందర్, ఉపసర్పంచ్ రవీందర్, కొమురవెల్లి వేణు, పసుపునూరి శ్రీను, మల్లేష్, బండారి సురేష్, కాటిపెల్లి మహేష్, గంగాధర్ పాల్గొన్నారు.

కోదండరాంపై వేసిన పిటిషన్ వాపస్ తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న తెలంగాణ జేఏసీ నాయకులు

పెద్దపల్లిటౌన్, జనవరి 31: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాంపై హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు వేసిన కేసును వాపస్ తీసుకొని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్, సీనియర్ అడ్వకేట్ డొంకెన రవి డిమాండ్ చేశారు. కోదండరాంపై హైకోర్టులో కేసు వేయడాన్ని ఖండిస్తూ జిల్లాకేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బుధవారం తెలంగాణ జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డొంకెన రవి మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆచార్య కోదండరాం రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను ఏకం చేసి, ఉద్యమాన్ని ముందుండి నడిపించారన్నారు. చారిత్రాత్మక సాగరహారం, సకలజనుల సమ్మె, మిలీనియం మార్చ్ తదితర ఉద్యమాలను విజయవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి కోదండరాం సేవలను గుర్తించని బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా నియమించడాన్ని జీర్ణించుకోలేక, హైకోర్టులో దావా వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బూర్ల ధనుంజయ్, తాడూరి శ్రీమాన్, తాండ్ర సదానందం, మల్లికార్జున్, భాస్కర్ యాదవ్, శ్రీధర్ దేవ, దేవ భారతి, జీవన్ రాజు, గూళ్ళ రాజు తదితరులు పాల్గొన్నారు

కోదండరాం నియామకాన్ని అడ్డుకోవడం సరికాదు

మంథని, జనవరి 31: రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరాంను గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీగా నియమించడాన్ని కొందరు ఆడుకుంటున్న విషయాన్ని తాము ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు బుధవారం తెలిపారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, టీజేఏసీ మాజీ కన్వీనర్ కోదండరాంని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీగా నామినేట్‌చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి జైలుకు వెళ్లలేదనే నెపంతో ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు చెందవనే అంశాన్ని సవరించాలన్నారు. ఉద్యమంలో అన్ని రకాల ప్రత్యేక ద్వారా పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉద్యమకారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించటానికి మంత్రి శ్రీధర్‌బాబు కృషిచేయాలని అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు రామడుగు మారుతిరావు, ప్రధానకార్యదర్శి ముష్క ఈశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శి పల్లె రాజయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంథని విజయ్ కుమార్, ఉప్పు మల్లయ్య, కాశీపేట సాంబయ్య, గుండ్రెడ్డి మల్లారెడ్డి, లింగయ్య, కొండయ్య, లక్ష్మినారాయణలు కోరారు.

పంచాయతీ పాలకవర్గాలకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 31: మండలంలోని గర్రెపల్లిలో ఎంపీటీసీ పులి అనూష, అధికారుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ వీరగోని సుజాత రమేష్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. ఉపసర్పంచ్‌ను, వార్డు సభ్యులను, కోఆప్షన్ మెంబర్లను ఎంపీటీసీ పులి అనూష, సెక్రటరీ ప్రశాంత్, కారోబార్ వెంకన్న, బిల్ కలెక్టర్ సందీప్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, సీఏలు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ దీకొండ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వర్కాపురం ఆంజనేయులు, రజని, మాజీ చైర్మన్ కల్లేపల్లి జానీ తదితరులు పాల్గొన్నారు.

మంథనిరూరల్, జనవరి 31 : మండలంలోని నగరంపల్లి సర్పంచ్ అలుగువెల్లి స్వరూప వీరారెడ్డి, పాలకవర్గాన్ని బుధవారం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, ఉప సర్పంచ్ అన్న పద్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఓదెల, జనవరి 31: మండలంలోని అబ్బిడిపల్లి సర్పంచ్ ఒజ్జ కోమలత శ్రీనివాస్ పదవీకాలం పూర్తి అయిన సందర్భంగా బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం అధికారులు, వార్డు సభ్యులు సర్పంచ్‌ని సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుకాదేవి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజీద్, సూపరింటెండెంట్ శ్రీధర్, వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ , జనవరి 31 : మండలంలోని గ్రామ పంచాయితీ ల సర్పంచ్‌లు బుధవారం పదవి కాలం ముగియడంతో పలు గ్రామ పంచాయితీల్లో వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. అందుగులపల్లి, బొంపల్లి, కాపులపల్లితో పాటు పలు గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులను శాలువాలతో సన్మానించారు. బొంపల్లి గ్రామంలో ఎంపీటీసీ ఎడెల్లి శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, గ్రామ సర్పంచ్ అరికిల్ల లక్ష్మయ్య, ఉప సర్పంచ్ పూరడి లక్ష్మయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 31 : సర్పంచుల పదవికాలం ముగియనుండడంతో మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం వారికి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి, మండల ప్రత్యేక అధికారి రంగారెడ్డి, తహసీల్దార్ బషిరొద్దిన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఎంపివో కిరన్, ఏపీవో సదానందం, టీఏ శ్రీకర్, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళి


గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, జనవరి 31: తన మాట పాటలతో ప్రజలను చైతన్యపరుస్తూ అనేక ప్రజా పోరాటాలకు దిక్సూచిగా నిలిచిన ప్రజా గాయకుడు గద్దర్ సూర్యచంద్రులు ఉన్నంతవరకు సజీవంగా ఉంటారని తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్ డొంకెన రవి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బుధవారం ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ జేఏసీ జిల్లా చైర్మన్, సీనియర్ న్యాయవాది డొంకెన రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై గద్దర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండ్ర సదానందం, బూర్ల ధనుంజయ్, ఆకుల స్వామి వివేక్ పటేల్, భాస్కర్ యాదవ్, జీవన్ రాజు, గూళ్ళ రాజు, మల్లికార్జున్, శ్రీధర్, కొండి సతీష్, దేవ భారతి, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 31: ప్రజా గాయకుడు గద్దర్ జయంతి వేడుకలను బుధవారం ధర్మారంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బొల్లి స్వామి ఆధ్వర్యంలో దళిత సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ధర్మారంలోని ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ మేడవేని తిరుపతి, దళిత సంఘాల నాయకులు కాంపెల్లి రాజేశం, దేవి రాజలింగయ్య, కాడె సూర్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 31: రామగుండం కార్పొరేషన్‌లో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శంకుస్థాపన చేశారు. జనగామలో రూ.5లక్షలతో కాపు సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.20లక్షలతో జనగామ ప్రధాన రహదారి పనులకు శంకుస్థాపన, ఏసీడీపీ నిధులు రూ.5లక్షలతో ఎల్లమ్మ దేవాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రాజాప్రతాప్‌నగర్‌లో రూ.5లక్షలతో గణేష్ మండప నిర్మాణం, సప్తగిరికాలనీలో రూ.45లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్‌దీపాలు ప్రధాన సమస్యలని, వీటిని పరిష్కరించడమే ముందున్న ధ్యేయమన్నారు. శంకుస్థాపన చేసిన పనులను కాంట్రాక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని, పనులు చేయడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. జనగామ కాపు సంఘం భవనంలో రాజ్‌ఠాకూర్, మనాలి దంపతులను గజ మాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో కమిషనర్ నాగేశ్వర్, డాక్టర్ క్యాస శ్రీనివాస్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, దాతు శ్రీనివాస్, కవిత సరోజిని, వేగోళపు రమాదేవిశ్రీనివాస్, ముస్తాఫా, నాయకులు దీటి బాల రాజు, ఉల్లంగుల రమేష్, కారం వినయ్, బండారి వెంకన్న, రాపల్లి సుధాకర్, నందం, నర్సింగారావు, బండారి రవి, మంగ, రజిత, జనగామ శివ, నారాయణ, ఇండ్ల స్వామి, జువ్వాడి మాధవరావు, నడిపెల్లి శ్రీధర్ రావు, సాగి అనీల్‌రావు, మేకల రాజేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం

పెద్దపల్లిటౌన్, జనవరి 31: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజెండాలో పలు అభివృద్ధి పనులపై 27 అంశాలు కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కౌన్సిల్ సభ్యులకు మరియు కోఆప్షన్ సభ్యులకు చైర్‌పర్సన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వైస్ చైర్‌పర్సన్ నాజ్మీన్ సుల్తానా మోబిన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేట జీపీ భవనం ప్రారంభం

ధర్మారం, జనవరి31: ధర్మారం మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని బుధవారం ఆ గ్రామ సర్పంచ్ జనగామ అంజయ్య ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంకసాని సతీష్‌రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ డైరెక్టర్లు


పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ముత్తారం, జనవరి 31: మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ పీఏసీఎస్ డైరెక్టర్లు మంత్రి శ్రీధరబాబు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో సింగిల్ విండో డైరెక్టర్లు ఏలువాక కొమురయ్య, గుజ్జ గోపాల్‌రావు, నాయిని పార్వతితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నల్లల శ్రీనివాస్, రేగుల నరేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి సర్వేష్‌గౌడ్, సీతంపేట పారుపల్లి సర్పంచులు పులిపాక నాగేష్, పారుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, డైరెక్టర్లు అల్లాడి శోభ, యాదగిరిరావు, మద్దెల లక్ష్మిరాజయ్య, గొల్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత

ముత్తారం, జనవరి 31: మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అదే గ్రామానికి చెందిన కూరాకుల అశోక్ స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అశోక్‌ను సన్మానించారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

పాలకుర్తి, జనవరి 31: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో బుధవారం జరిగిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ సప్న, ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, జనవరి 31: మండలం పరిధిలోని జయ్యారం గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు ఈత చెట్టు నుంచి మోకు జారి కింద పడడంతో గీత కార్మికుడు బుర్ర లక్ష్మినర్సయ్య తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్స అందించారు.

ఎన్టీపీసీ జీఎంకు ఘనంగా వీడ్కోలు


అలోక్‌చంద్ర ఠాకూర్‌ను సన్మానిస్తున్న ఎన్టీపీసీ ఈడీ

జ్యోతినగర్, జనవరి 31 : పదవీ విరమణ చేస్తున్న రామగుండం ఎన్టీపీసీ జీఎం(మెయింటెనెన్స్) అలోక్‌చంద్ర ఠాకూర్‌ను బుధవారం యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో జరిగిన పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో ఎ.సి.ఠాకూర్, సీనియర్ మేనేజర్ ప్రభాస్ చంద్ర ఝూలను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు, ఉన్నతాధికారులు శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. పదవీ విరమణ చేస్తున్న జీఎం ఠాకూర్, అధికారి ప్రభాస్‌చంద్ర ఝా టౌన్‌షిప్‌లో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

పెద్దపల్లిటౌన్, జనవరి 31: దేశ వ్యాపంగా 16న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ అధికారులకు సమ్మె నోటీస్ అందజేశారు. కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి అనంతరం వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మె లో సంఘటిత అసంఘటిత కార్మికులు ఉద్యోగులు గ్రామీణ కూలీలు, వ్యవసాయ రైతులు గ్రామపంచాయతీ సింగరేణి కాంటాక్ట్, కార్మికులు, ఎన్టీపీసీ, సింగరేణి ఆర్టీసీ ఎల్ఐసీ, పోస్టల్, బ్యాంకింగ్, మున్సిపల్, పంచాయతీ, మధ్యాహ్న భోజన వర్కర్స్ ఆశ అంగన్వాడి, హమాలీ, మార్కెట్ గోదాం, ఔట్సోర్సింగ్ మిషన్ భగీరథవర్కర్స్, ఆల్ డిపార్మెంట్ సకల కార్మికులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ సమితి కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ధర్మారం, జనవరి31: ధర్మారం మండలం కొత్తూర్ గ్రామానికి చెందిన తమ్మడవేని నర్సయ్య(54) అనే వ్యక్తి ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇటీవల మండలంలోని బొట్లవనపర్తి గ్రామంలో జరిగిన ఒకరి అంత్యక్రియలకు కొత్తూర్ గ్రామానికి చెందిన తమ్మడవేని నర్సయ్య, తమ్మడవేని చిన్న నర్సయ్య, ఆవుల మల్లయ్యలు కలసి బైక్‌పై వెళ్లారు. తిరిగి కొత్తూర్ గ్రామంలోకి రాగా తమ్మడవేని చిన్న నర్సయ్య తన బైకును అతివేగంగా నడుపుతూ అదుపు తప్పి మృతుడు నర్సయ్య ఇంటి సమీపంలో గల డ్రైనేజీలో పడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తమ్మడవేని నర్సయ్యను చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం నర్సయ్య మృతి చెందాడని మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సుల్తానాబాద్, జనవరి 31: పూసాల మాజీ సర్పంచ్, స్వప్న కాలనీ నిర్మాణ బిల్డర్, ఐపీఎస్ స్కూల్ వ్యవస్థాపక అధ్యక్షులు మాటేటి గట్టయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎంపీపీ, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు వేముల రామ్మూర్తి బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మేర్గు యాదగిరి, స్వతంత్ర కుమార్, మాటేటి లక్ష్మీనారాయణ, మాటేటి రవీందర్ పాల్గొన్నారు.

● **ముత్తారం**: మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన దేశిని రాజు తండ్రి లింగమూర్తి ఓదెల మండలం మడక గ్రామంలో ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మూగ రవి పాల్గొన్నారు.



మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల నిర్వహణపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, జనవరి 31: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో ఫిబ్రవరి 5వ, తెది నుంచి వివిధ గనులు, డిపార్టమెంట్‌లలో నిర్వహించే మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించడంపై ప్రణాళికాబద్ధంగా పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీతారామం, బైద్య, నాగేశ్వర్‌రావు, పద్మరాజు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన అధికారుల సంఘం అధ్యక్షుడు

రామగిరి, జనవరి 31: సింగరేణి ఏపీఏ డివిజన్ పరిధిలోని డీవైఎస్ఈ శ్రీకాంత్, సెఫ్టీ అధికారి ఆసిఫ్‌యాసిన్‌లు అనారోగ్య కారణాలతో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని బుధవారం అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రెఫరల్ చేయాల్సిందిగా డీవైసీఎంవో డాక్టర్ కిరణ్‌ను కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బొగ్గు ఉత్పత్తికి అంకిత భావంతో పని చేయాలి : జీఎం


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని, జనవరి 31: బొగ్గుఉత్పత్తికి అంకిత భావంతో పనిచేయాలని ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులతో జీఎం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌జీ-1లో సంస్థ అభివృద్ధికి సాధించాల్సిన అంశాలు, వివిధ సలహాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని వెలికి తీయాలని, ప్రణాళికల ద్వారా బొగ్గు ఉత్పత్తి సాధిస్తే లాభాల బాటలో పయనిస్తుందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అధికారులు రాంమూర్తి, లక్ష్మీనారాయణ, చిలుక శ్రీనివాస్, చంద్రశేఖర్, కిరణ్‌రాజ్‌కుమార్, ధనలక్ష్మిబాయ్, ఆంజనేయులు, రాజం, శ్రీధర్, శ్రీనివాస్, నెహ్రూ, వీరారెడ్డి, రమేష్ కుమార్, అనీల్ గబాలేతో పాటు యూనియన్ నాయకులు రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్ విస్తరణ పనులకు భూమిపూజ


విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 31 : రామగుండం 3 ఏరియాలోని ఎస్ఎంఎస్ ప్లాంటు విస్తరణ పనులకు బుధవారం ఆర్‌జీ 3 జీఎం ఎన్.సుధాకర్‌రావు భూమిపూజ చేశారు. విస్తరణ పనులలో భాగంగా బీఎండీ ట్రక్ షెడ్, సైకిల్‌షెడ్, క్వాలిటీ ల్యాబ్, ఎస్ఎంవో షెడ్ తదితర నిర్మాణాలకు ప్లాంటు ఆవరణలో జీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జీ 3 జీఎం సుధాకర్‌రావు మాట్లాడుతూ రావగుండం రీజియన్‌లో ఉన్న ఉపరితల గనులలో మట్టి(ఓబీ) వెలుకితీత పనుల కోసం ఉపయోగించే పేలుడు పదార్థం ఇక్కడి ఎస్ఎంఎస్ ప్లాంటు నుంచి సరఫరా అవుతున్నదని, సంవత్సరానికి 30వేల టన్నులు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. మరిన్ని అవసరాల కోసం ప్లాంటు సామర్థ్యాన్ని 60 వేల టన్నులకు అభివృద్ధి(విస్తరణ) చేపట్టామన్నారు. 1.80 కోట్ల రూపాయల వ్యయంతో విస్తరణ పనులు చేస్తున్నామని, నిర్దేశిత లక్ష్యాన్ని అనుకున్న సమయంలో భద్రతతో పూర్తి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎన్.రమేష్, డీజీఎం(సివిల్) పద్మరాజు, మేనేజర్ శరవణన్, డీవైఎస్ఈ(సివిల్) ఎన్.రామకృష్ణ, సివిల్ సూపర్‌వైజర్ సమ్మయ్యతో పాటు అధికారులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 31 : ఆర్‌జీ2 ఏరియా, జీడికె11 ఇంక్లయిన్, ఓసీపీ1లో పని చేస్తున్న కార్మికులతో క్వార్టర్ల కేటాయింపునకు సంబంధించి బుధవారం సీఈఆర్ క్లబ్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటి వరకు క్వార్టర్లు లేని కార్మికులు, చేంజ్‌ఆఫ్ క్వార్టర్ విషయంలో అధికారులు కౌన్సెలింగ్ చేశారు. 422 క్వార్టర్లకు 250 మంది కార్మికులు దరఖాస్తు చేసుకోగా, అందులో 91 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా 74 మందికి క్వార్టర్లను కేటాయించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవిందర్, ఏరియా రక్షణ అధికారి బి.రవిందర్, డీజీఎం(పర్సనల్), అధికార ప్రతినిధి జి. రాజేంద్రప్రసాద్ పర్సనల్ మేనేజర్ అనిల్‌కుమార్, సివిల్ సూపర్‌వైజర్ నరేష్, క్వార్టర్ సెక్షన్ ఇన్‌చార్జి రాంసాగర్ తదితరులు పాల్గొన్నారు.